క్లుప్తంగా

విద్యార్థినులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందించిన దాతలతో విద్యార్థినులు

మడకశిరరూరల్: సరస్వతీ కటాక్షం ఉన్నా లక్ష్మీ కటాక్షం లేని ఇంటర్, డిగ్రీ చదువుతున్న ఏడుగురు పేద విద్యార్థినులకు ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 43 మంది ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందించి పేద విద్యార్థినుల చదువుకు భరోసాగా నిలిచారు. పట్టణంలోని వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శాలినికు రూ.15 వేల, పల్లవికి రూ.7 వేల, ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న మమతకు రూ.7 వేలు, భవ్యకు రూ.7 వేలు, కావ్యకు రూ.7 వేలు, డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న రక్షితకు రూ.5 వేలు అందజేశారు. అలాగే బెంగళూరులో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదుతున్న కావ్యకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.58 వేలు నగదును హెచ్ఎంలు విశ్వనాథ్, చంద్ర మోహన్ తెలిపారు.

శ్రీవారి దర్శనాన్నీ చేసుకోనివ్వరా?



తిరుపతిలో హరిప్రసాద్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతున్న వేణురెడ్డి

చిలమత్తూరు: ఎంపీ మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని తమ అభిమాన నేత కోసం తిరుమలకు పాదయాత్రకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్‌రెడ్డిని పోలీసులు అడ్డుకొని, అరెస్ట్ చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి మండిపడ్డారు. పోలీసులు కూటమి ప్రభుత్వం ఆడించినట్లు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రగా వెళుతున్న హరిప్రసాద్‌రెడ్డికి వేణురెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. అనంతరం అలిపిరి మెట్ల వద్ద అరెస్ట్ వార్త విన్న వేణురెడ్డి పోలీసుల తీరును తప్పుపట్టారు. శ్రీవారి దర్శనం చేసుకోవడానికి కూడా పోలీసులు ఆంక్షలు విధించడం దారుణమన్నారు.

కల్లూరులో కార్డెన్ సెర్చ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

లేపాక్షి: లేపాక్షి మండలం కల్లూరు గ్రామంలో మంగళవారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద ఇళ్లలో తనిఖీలు చేశారు. అదేవిధంగా పాత నేరస్తులు, అసాంఘిక కార్యకలాపాలను ప్రేరేపించే వారిపై ఆరా తీశారు. అనంతరం బస్టాండులో ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐ నరేంద్ర మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణంలో జీవనం సాగించడానికి అనుకూల పరిస్థితుల గురించి వివరించారు. అక్రమంగా మద్యం సరఫరా చేయడం, బెట్టింగ్‌లు, పేకాట, మట్కా, బాల్యవివాహాలు నిర్వహించడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



రోగులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

అగళి: గ్రామాల్లో డెంగీ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజుల వాణి తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అయితే చెత్త కుప్పల మధ్య పడేసిన మందులను చూసి వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శివనంద, చిదనంద , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోండి

పావగడ: వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అర్బన్ సీఐ సురేశ్ తెలిపారు. ఉత్సవాల్లో డీజేలకు అవకాశం లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.



పెనుకొండ: బురదమయంగా మారిన మసీదు రోడ్డు



అమరాపురం: ఉన్నత పాఠశాల ముందు భాగాన ఉన్న రోడ్డులో నిలిచిన వర్షపునీరు



అమరాపురం మండలం తమ్మడేపల్లిలోని బీసీ కాలనీ పక్కన బురదమయంగా మారిన రోడ్డు

రోడ్లన్నీ బురదమయం

రహదారులను అద్దంలా తీర్చిదిద్దుతాం. గుంతల్లేని రహదారులను ప్రజలందరూ చూస్తారంటూ ఎన్నికలకు ముందు గొప్పలు చెప్పుకున్నారు కూటమి నేతలు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలన్నీ గంగపాలు చేశారు. పట్టణాలు మొదలు గ్రామీణ ప్రాంతాల వరకూ చిన్నపాటి వర్షాలకే బురదమయంగా మారుతున్నాయి. అడుగు తీసి అడుగు పెడదామంటే ఏ గుంతలున్నాయోనని ప్రజలు ఆందోళన చెందాల్సిన దుస్థితి నెలకొంది.

– సాక్షి బృందం



గుడిబండ: బురదమయంగా మారిన చిగతుర్పి - తాళకెర రహదారి



రొద్దంలో సచివాలయం-3 వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి ఇలా..



గుడిబండ మండలం బైరేపల్లి నుంచి టీడీ పల్లి వెళ్లే రోడ్డు ఇలా..



పెనుకొండ: అధ్వానంగా మారిన అంజనేయస్వామి రోడ్డు

ఫేషియల్ యాప్‌ను కచ్చితంగా అనుసరించాలి



యూనిట్ పరీక్షను పరిశీలిస్తున్న డీఐఈఓ చెన్నకేశవప్రసాద్

హిందూపురం టౌన్: అధ్యాపకులు కచ్చితంగా ఫేషియల్ యాప్‌ను అనుసరించాలని డీఐఈఓ చెన్నకేశవప్రసాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో ఆయన సమావేశమయ్యారు. అధ్యాపకులు సెలవు తీసుకునే ముందు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. తర్వాత విద్యార్థులను అడిగి బోధనాపరంగా సమస్యలను తెలుసుకున్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అనంతరం రెండో యూనిట్ పరీక్షను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



లేపాక్షి: దాగురే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు



హిందూపురంలో తెలుగు తల్లి విగ్రహానికి పూల మాలలు వేస్తున్న డీఎస్పీ మహేష్ , తదితరులు

లేపాక్షి: మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని లేపాక్షి ఫొటో అండ్ వీడియో వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. కెమెరా సృష్టికర్త దాగురే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు మహేష్‌తో పాటు యూనియన్ నాయకులు సందీప్, నాగరాజు, అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: హిందూపురం ఫొటో వీడియో గ్రాఫర్స్ మిక్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఫొటో, వీడియో గ్రాఫర్లను ప్రభుత్వం గుర్తించి ఇంటిపట్టాలు, సబ్సిడీ పథకాలు అందించి ఆదుకోవాలని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. అనంతరం మేళాపురం క్రాస్‌లోని గణపతి ఆలయంలో పూజలు చేసి తెలుగు తల్లి విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేయించారు.

చిలమత్తూరు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా చిలమత్తూరులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల ఫొటోగ్రాఫర్లు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ ప్రెసిడెంట్ లక్ష్మినారాయణ, వైస్ ప్రెసిడెంట్ బాలాజీ, మూర్తి, ఆది, హరి, మల్లి, నందీశ్, ఈశ్వర్, నరేష్, ప్రసన్న మూర్తి, మారుతీ, రంజిత్, బాలాజీ నాయక్, సతీష్,గణేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని గుడిబండ, అమరాపురం, అగళి, రొళ్ల మండలాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధ, గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రఘు తెలిపారు. 132 కేవీఏ హిందూపురం , జమ్మలబండ ఏపీ ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో దంపర్లు అమరుస్తున్నారన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలందించండి

రొళ్ల: గ్రామీణులకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సీసీ కెమెరాలు, స్కానింగ్ సెంటర్, ఎక్స్‌రేప్లాంట్‌తో పాటు పోస్టుమార్టం నిర్వహించడానికి ప్రత్యేక గది వైద్యులను కేటాయించాలని ప్రజాప్రతినిధుల దృష్టికి డాక్టర్లు బాలప్రణీత్‌రెడ్డి, కుల్‌దీప్, సృజన తదితరులు తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు.

కృష్ణా ముకుందా మురారీ..



అమరాపురం మండలం ఉదుగూరులో శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న దృశ్యం



ముద్దిరెడ్డిపల్లిలో శ్రీకృష్ణుడిని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరు గ్రామంలో మంగళవారం కృష్ణాష్టమి సందర్భంగా యాదవ కులస్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

హిందూపురం: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ముదిరెడ్డిపల్లిలో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. భక్తులు ప్రత్యేక గీతాలను ఆలపిస్తూ మేళతాళాలతో ఊరేగింపు సాగింది. ముదిరెడ్డిపల్లి ప్రధాన రహదారి భాగ్యనగర్ వాటర్ ట్యాంక్ వద్ద నుంచి నంది సర్కిల్ వరకు ఊరేగింపుగా సాగింది.

మడకశిర డిపో అభివృద్ధికి నిధులిస్తాం

- ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపో అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తానని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు అన్నారు. మంగళవారం ఆయన మడకశిర డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలో మొక్కలు నాటారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిపోలో గదుల కొరత ఉందని, డీఎం కార్యాలయ భవనం లేదని స్థానిక ఆర్టీసీ అధికారులు ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కార్మికులతో సమావేశమయ్యారు. ఈయూ, ఎస్ఎంయూ నాయకులు ఎండీని సన్మానించారు. ద్వారక తిరుమలరావు మాట్లాడుతూ మడకశిర డీఎం ఆఫీస్ నిర్మాణానికి రూ.25 లక్షలు , గదుల నిర్మాణానికి మరో రూ.7 లక్షలు మంజూరు చేస్తామన్నారు. ఆర్టీసీ సిబ్బంది కష్టపడి పని చేసి సంస్థకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కిందిస్థాయి ఉద్యోగులకు త్వరలోనే పదోన్నతులు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్‌రావు, ఈడీఏ చెంగల్‌రెడ్డి, డీపీటీఓ మధుసూదన్, డీఎం రంగభాష్యం, సేఫ్టీ ఇన్స్‌పెక్టర్ అజ్మతుల్లా, ఈయూ అధ్యక్షుడు రఫిక్, కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎంయూ నాయకులు రామకృష్ణ, జయసింహ, పురుషోత్తం, ముద్దప్ప, సుబ్బరాయుడు, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మడకశిర డిపోలో అనేక సమస్యలు ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావును స్థానిక ఈయూ నాయకులు కోరారు. సమస్యతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందించారు. ఈయూ నాయకులు రఫిక్, రంగనాథ్, నరసింహులు తదితరులు ఉన్నారు.

నిరవధిక ధర్నా విరమణ



ధర్నా విరమిస్తున్న జేడీఎస్ నాయకులు

పావగడ: పట్టణంలోని మున్సిపల్ కార్యాయం ఆవరణ వద్ద జేడీఎస్ నాయకులు గత ఆరు రోజులుగా చేస్తున్న ధర్నాను మంగళవారం విరమించారు. పట్టణంలోని కుమార స్వామి లే అవుట్ పేరును తొలగించి వెంకటరమణప్ప లే అవుట్ గా నామకరణం చేయడానికి సిద్ధమైన మున్సిపల్ అధికారుల తీరును నిరసనగా ఆందోళన చేపట్టిన విషయం పాఠకులకు విదితమే. తహసీల్దార్ వరదరాజు, మున్సిపల్ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ నిరవధిక దీక్షా శిబిరం వద్దకు చేరుకుని జిల్లా కలెక్టర్ ఆమోదం పొందే వరకు కుమారస్వామి లే అవుట్ మార్పు పై ఎలాంటి నిర్ణయాలు తీసుకోమని లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్సీ అంజినప్ప, తిమ్మారెడ్డి, బలరామరెడ్డి, గంగాధర్ నాయుడు, కావలగేరి రామాంజినప్ప, గుట్టహళ్ళి మణి, భరత్, మను మహేశ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ సహస్ర నామ పారాయణం



ఊరేగింపులో పాల్గొన్న ఆర్యవైశ్యులు

అమరాపురం: స్థానిక కన్యాకా పరమేశ్వరీ ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న మంటపం త్వరగా పూర్తి కావాలంటూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వాసవీ సహస్ర నామ పారాయణాన్ని నిర్వహించారు. ఆలయం నుంచి గోమాత, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

అందరికీ హాస్టల్ సీట్లు కేటాయించాలి

మడకశిర: నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, హాస్టళ్ల వార్డెన్లతో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పట్టణంలో మంగళవారం సమావేశమయ్యారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులందరికీ హాస్టల్ సీట్లు కేటాయించాలని, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. భోజనం నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని వార్డెన్లకు సూచించారు. సమావేశంలో పెనుకొండ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అఫీసర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు 31 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద రూ.11.75 లక్షలను చెక్కులు రూపంలో అందించారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ల విడుదల

హిందూపురం టౌన్: పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లను సీపీఐ నాయకులు విడుదల చేశారు. సీపీఐ హిందూపురం కార్యదర్శి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 23, 24, 25 తేదీల్లో ఒంగోలు పట్టణంలో సీపీఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ముస్లిం నాయకుడి మృతి

పెనుకొండ: పట్టణానికి చెందిన ముస్లిం నాయకుడు, మత పెద్దల్లో ఒకరైన జఫ్రుల్లాఖాన్ అనారోగ్యంతో సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆయన మృతికి పలువురు ముస్లింలు సంతాపం వ్యక్తం చేశారు. పలువురు ముఖ్యులు ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

మైక్‌సెట్ వితరణ

లేపాక్షి: మండలంలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పీఎస్.ప్రసాద్ మైక్‌సెట్‌తో పాటు హారన్ స్పీకర్, ఆంప్లిప్లేయర్, మైక్రోఫోన్‌ను పాఠశాలకు మంగళవారం వితరణ చేసారు. హెచ్ఎం శేషగిరిబాబుతో పాటు ఉపాధ్యాయులకు అందజేశారు.

చంద్రబాబుకు దివ్యాంగుల ఉసురు తగులుతుంది

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



చిలమత్తూరు: దివ్యాంగుల ఉసురు చంద్రబాబుకు తప్పక తగులుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక ఒక ప్రకటనలో మండిపడ్డారు. పుట్టుకతోనే వైకల్యం ఉన్న వాళ్ల పింఛన్లు తొలగిస్తున్నారని, వైకల్యం పూర్తిస్థాయిలో ఉన్నా 40 శాతం కన్నా తక్కువ ఉందని చూపి పింఛన్ తొలగించడం దుర్మార్గమన్నారు. ఏం పాపం చేశారని దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తున్నారో కూటమి నేతలు సమాధానం చెప్పాలన్నారు. చిలమత్తూరు మండలంలోని కల్లుకుంటకు చెందిన 24 ఏళ్ల దివ్యాంగ యువతి పుట్టినప్పటి నుంచి నడవలేని పరిస్థితి ఉందన్నారు. అధికారులు కనికరం లేకుండా పింఛన్‌ను తొలగించడం అన్యాయమన్నారు. కొత్త పింఛన్లు ఇవ్వడం లేదని, పైగా ఉన్న వాటిపై లేని ఆంక్షలు పెట్టి తొలగిస్తున్నారన్నారు. దివ్యాంగులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

దుకాణంలో చోరీ

పెనుకొండ: పట్టణంలోని ఓ దుకాణంలో రూ.50 వేలు విలువైన వస్తువులు, నగదు దోచుకెళ్లిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు.. స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎదురుగా కిష్టప్ప అనే వ్యక్తి చిల్లర కొట్టు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే దొంగలు దుకాణానికి వేసిన తాళాలు పగుల గొట్టి రూ. 25 వేల నగదుతో పాటు రూ. 25 వేల వస్తువులు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి భాధితులు తెలిపిన మేరకు కేసు నమోదు చేశారు.

కేబుల్ చోరీ

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట గ్రామంలో రైతులు రంగనాథప్ప, రంగధామప్పకు చెందిన వ్యవసాయ బోరుబావులకు అమర్చిన కేబుల్ వైర్‌ను సోమవారం రాత్రి అపహరణకు గురైంది. ఇద్దరు బోర్లుకు సంబంధించి దాదాపు 30 మీటర్ల కేబుల్ చోరీ చేసినట్లు బాధిత రైతులు వాపోయారు. అలాగే వాటర్‌వర్క్స్‌కు చెందిన బోరుబావికి అమర్చిన 15 మీటర్ల కేబుల్ కూడా దొంగిలించినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

హిందూపురం: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని సప్తఫణి సుబ్రహ్మణ్యుడి ఆలయంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేసి పుష్పాలంకరణ చేశారు. భక్తులు తరలి వచ్చి నాగపడగలకు పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.